సాక్షి మంచిర్యాల

ఆదివారం, 19, ఫిబ్రవరి, 2023

న్యూస్‌రీల్

ఉత్సాహంగా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు



క్రీడాకారులతో సురేందర్‌రెడ్డి కరచాలనం

శ్రీరాంపూర్: మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ప్రగతిమైదానంలో 41వ నేషనల్ సబ్ జూనియర్ బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మైదానంలో సందడి నెలకొంది. శనివారం పోటీలను గుర్తింపు సంఘం టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఎస్సార్పీ 3గని మేనేజర్ సంతోష్‌కుమార్ ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను తిలకించారు. రెండ్రోజులుగా లీగ్‌మ్యాచ్‌లు సాగుతున్నాయి. మొత్తం 35పాయింట్లకు లీగ్ మ్యాచ్ ఉంటుంది. బెస్ట్ ఆఫ్ త్రీ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహించి విజేతలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ ఆర్.నారాయణరెడ్డి, జాయింట్ సెక్రెటరీ గోపాల్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లీగ్ మ్యాచ్‌ల విజేతలు వీరే..

బాలురలో ..

మహారాష్ట్ర, రాజస్థాన్, బిహార్, తమిళనాడు, ఒడిశా, హర్యానా, పశ్చిమబంగాల్, కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ జట్లు విజేతలుగా నిలిచాయి.

బాలికల్లో...

మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, హర్యానా, పాండిచ్చేరి, తెలంగాణ, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్, బిహార్, గుజరాత్ జట్లు విజయం సాధించాయి.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య



సాయికిరణ్(ఫైల్)

మంచిర్యాలక్రైం: భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ శివారులో చోటు చేసుకుంది. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన భూక్య సాయికిరణ్ (30) సిర్పూర్ మండలంలోనిన్‌వెల్లి గ్రామానికి చెందిన ప్రేమలను ఎనిమిదేళ్ల క్రితం ప్రేమించి పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నాడు. దంపతులిద్దరూ స్థానిక హమాలివాడలో నివాసం ఉంటున్నారు. రెండేళ్ల క్రితం దంపతుల మధ్య కలహాలు రావడంతో ప్రేమల పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని పలుమార్లు పెద్దల సమక్షంలో నచ్చజెప్పినప్పటికీ రాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. శనివారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి చందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

గండాలు తొలగించే గండచిలుక !



దండేపల్లి: మహా శివరాత్రి పండుగ సందర్భంగా శనివారం శివునికి ఉపవాస దీక్షలు చేసేవారు కొందరు తమ ఇళ్ల ముందు రోకలిబండను పాతి దానిపై దీపం వెలిగించారు. దీనిని గండచిలుక(గండదీపం) అంటారు. ఇలా వెలిగించడం వల్ల గండాలు తొలగిపోతాయని భక్తుల నమ్మకం. శనివారం మండల కేంద్రమైన దండేపల్లితోపాటు పలు గ్రామాల్లో గండదీపాలు వెలిగించారు.

శివోహం..!



మట్టి లింగాలతో ఏర్పాటు చేసిన శివలింగం



మంచిర్యాల ఆలయంలో..

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- మార్మోగిన శివ నామస్మరణ

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో శివనామస్మరణ మారుమోగింది. శివరాత్రి సందర్భంగా ఆలయాల్లో భక్తుల సందడి నెలకొంది. మంచిర్యాల గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించడానికి వేలాదిగా తరలిరావడంతో కిలోమీటరుకు పైగా భక్తజన సందోహంతో నిండిపోయింది. కొందరు షవర్ల వంద స్నానాలు ఆచరించారు. అనంతరం గోదావరి నది ఒడ్డున ఉన్న గౌతమేశ్వర ఆలయంలో పూజలకు బారులు తీరారు. దర్శనానికి గంటలకొద్దీ వేచి చూశారు. స్థానిక ఎమ్మెల్యే ఎన్.దివాకర్‌రావు శివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా ఆటోలు, ఇతరత్రా వాహనాలు అనుమతించకపోవడంతో కిలోమీటర్ల మేర నడవాల్సి రావడంతో వృద్ధులు ఇబ్బందులు పడ్డారు. గోదావరి తీరం వద్ద భద్రతను డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ పర్యవేక్షించారు. గౌతమినగర్ కోదండరామాలయం, శివాలయాల్లో భక్తులు తరలివచ్చి పూజలు చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ సిరిపురం రాజేశ్ ఆధర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. విశ్వనాథ ఆలయంలో వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు, ఆయన తనయుడు విజిత్‌రావు పాల్గొన్నారు. హరిహర క్షేత్రంలో కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు అభిషేకాలు జరిపించారు. కలెక్టర్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.

లక్ష శివలింగాలతో మహా శివలింగం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జిల్లా కేంద్రంలోని భగవద్గీత అధ్యయన మండలిలో మట్టి శివలింగాలతో మహా శివలింగాన్ని రూపొందించారు. శివరాత్రి సందర్భంగా శనివారం ఆర్యవైశ్య మహాసభ మంచిర్యాల పట్టణమహిళా సంఘం ఆధ్వర్యంలో మట్టితో చిన్న చిన్న శివలింగాలు లక్షా 11,116 తయారు చేశారు. వాటన్నింటితో మహాశివ లింగం ఏర్పాటు చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు జ్యోతి, పట్టణ అధ్యక్షురాలు తిరుమల, కార్యదర్శి లలిత పాల్గొన్నారు.



శివాలయంలో ఎమ్మెల్యే దివాకర్‌రావు పూజలు



మల్లన్న స్వామిని దర్శించుకుంటున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



విశ్వనాథస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తూ



మల్లన్న స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గోదావరి నదిలో శివభక్తుడు

వేలాల.. భక్త జనసంద్రం

- శివ నామస్మరణతో మార్మోగిన మల్లన్న గట్టు
- బోనాలు పోసి.. పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్న భక్తులు
- కన్నుల పండువగా మల్లికార్జునస్వామి కల్యాణ మహోత్సవం



వేలాలలో శివలింగం



భద్రతను పర్యవేక్షిస్తున్న డీసీపీ సుధీర్ రాంనాథ్

జైపూర్: వేలాల జాతరకు భక్తజనం పోటెత్తింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. అటవీ ప్రాంతంలోని గట్టు మల్లన్న సన్నిధి జనసంద్రంగా మారింది. శివనామస్మరణతో మల్లన్న గట్టు మార్మోగింది. మహా శివరాత్రిని పురస్కరించుకుని నిర్వహించిన మల్లన్నస్వామి జాతర శనివారం వైభవంగా ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాతోపాటు పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్‌భూపాలపల్లి, కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, హైదరాబాద్, నిజామాబాద్, మహారాష్ట్రలోని సిరోంచ, గడ్చిరోలి ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. సమీపంలోని పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి సన్నిధికి చేరారు. ఈ ఏడాది సమ్మక్క–సారక్క జాతర లేకపోవడంతో వేలాల జాతరకు భారీగా తరలివచ్చారు. దర్శనానికి ఆరు నుంచి ఎనిమిది గంటల సమయం పట్టింది. దివ్యదర్శనానికి భక్తులు ఉదయం నుంచి రాత్రివరకు బారులు తీరారు. దొణలో స్వయంభూగా వెలిసిన శివలింగాన్ని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. శివసత్తుల పూనకాలు, లయబద్ధ నృత్యాలు, లక్ష్మీదేవరుల ప్రదర్శనలు, ఒగ్గు పూజారుల ఢమరుకం మోతలతో వేలాల గట్టు దద్దరిల్లింది. ఉపవాస దీక్షలతో బోనాలు పోసి పట్టు వస్త్రాలతో పట్నాలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు. కుటుంబ సభ్యులతో రాత్రంతా జాగారం చేశారు. ట్యాంకుల్లో నీళ్లు మళ్లీ నింపకపోవడంతో భక్తులు కొంత ఇబ్బందులు పడ్డారు. జైపూర్ ఏసీపీ నరేందర్ నేతృత్వంలో శ్రీరాంపూర్ సీఐ రాజు, ఎస్సై రామకృష్ణ ఆధ్వర్యంలో 500మంది పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించారు. 50సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాల నిఘాలో జతర సాగింది.

వైభవోపేతంగా కల్యాణ మహోత్సవం..

మల్లిఖార్జున స్వామి ఆలయంలో రాత్రి 7గంటలకు వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవోపేతంగా జరిపించారు. భక్తులు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని కన్నులారా వీక్షించారు.

దర్శించుకున్న ఉన్నతాధికారులు...

మల్లిఖార్జున స్వామిని కలెక్టర్ బాదావత్ సంతోష్, డీసీపీ కేకన్ సుధీర్ రాంనాథ్, జైపూర్ ఏసీపీ నరేందర్, ఆర్డీవో వేణు, చెన్నూర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ సతీమణి రాణి అలేఖ్య, జెడ్పీటీసీ మేడి సునీత దర్శించుకున్నారు. డ్రోన్ కెమెరా ద్వారా వేలాల జాతర ప్రదేశాలను డీసీపీ పర్యవేక్షించారు.



పూజల్లో బెల్లంపల్లి ఎమ్మెల్యే చిన్నయ్య దంపతులు



పాలాభిషేకం చేస్తున్న జడ్జి హిమబిందు

బుగ్గ జాతర

బెల్లంపల్లి: మండలంలోని కన్నాల శివారులో ఉన్న బుగ్గరాజేశ్వరస్వామి జాతరకు శనివారం భారీగా తరలివచ్చారు. మహా శివరాత్రి సందర్భంగా సుమారు లక్షన్నర మందికిపైగా వచ్చినట్లు అధికారులు అంచనా వేశారు. తెల్లవారు జాము నుంచే వేద పండితులు రాజరాజేశ్వరుడికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి జి.హిమబిందు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, ఆలయ కమిటీ చైర్మన్ మాసాడి శ్రీదేవి, బెల్లంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ జక్కుల శ్వేత, కన్నాల సర్పంచ్ జిల్లపెల్లి స్వరూప దంపతులు శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచే కాకుండా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. వీఐపీ పాసులు కలిగిన భక్తులకు ఉదయం 9 గంటలలోపు, సాయంత్రం 7 తర్వాత దర్శనం కల్పించారు. సొంత వాహనాలపై జాతరకు వచ్చిన భక్తుల నుంచి ఆలయ కమిటీ నిర్వాహకులు చార్జీ రూపేణ దండుకున్నారనే విమర్శలు వచ్చాయి. బుగ్గ రోడ్డు గుంతలు పడి ఉండడంతో వాహనాల రాకపోకలతో దుమ్మురేగి భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య ఆధ్వర్యంలో సీఐలు రాజ్‌కుమార్ గౌడ్, జగదీష్ బందోబస్తు నిర్వహించారు.



మంచిర్యాలలో శివలింగానికి అభిషేకం

కన్నుల పండువగా శివపార్వతుల కల్యాణం

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల విశ్వనాథ ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలను పురష్కరించుకుని శనివారం రాత్రి శివపార్వతుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలను తిలకించేందుకు భక్తులు తరలివచ్చారు. విశ్వనాథ స్వామి ఆలయం నుంచి దేవతామూర్తులను సన్నాయిమేళాల మధ్య పూలతో ప్రత్యేకంగా అలంకరించిన కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. వేద పండితుడు కార్తీక్‌శర్మ నేతృత్వంలో అర్చకులు నరహరిశర్మ, బాలకృష్ణశర్మ, భట్టాచార్యుల వేదమంత్రోచ్చరణల మధ్య శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. నేత్రపర్వంగా సాగిన కల్యాణ మహోత్సవాన్ని చూసి భక్తులు తన్మయత్వం చెందారు. అనంతరం నిశీపూజ, స్వామివారికి బిల్వదళ సమర్పణ కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు డీసీపీ సుధీర్ రాంనాథ్ కేకన్ విశ్వనాథుని దర్శించుకున్నారు. స్థానిక గౌతమినగర్‌లో కోదండ రామాలయంలో శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. భక్త మార్కేండేయ ఆలయంలో శివపార్వతుల కల్యాణానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు.



శివపార్వతుల కల్యాణం జరిపిస్తున్న పండితులు



బుగ్గ జాతరలో బారులు తీరిన భక్తులు



వేలాలో దర్శనానికి బారులు తీరిన భక్తులు



మంచిర్యాల గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు



మంచిర్యాల గోదావరి రోడ్డులో కిక్కిరిసిన భక్తులు

ఐదేళ్లకే కళ తప్పింది!

- 'గాంధారి' గతమే ఘనం..
- నేడు ఎటుచూసినా కళావిహీనం
- నిర్వహణను గాలికి వదిలేసిన అటవీశాఖ
- శిథిలమవుతున్న చిల్డ్రన్స్ పార్కు
- ఎండిపోతున్న మొక్కలు, వృక్షాలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పిల్లల పార్కులో అధ్వానంగా నడకదారి



పిల్లల పార్కులో విరిగిన బెంచీలు

రామకృష్ణాపూర్(చెన్నూర్): చుట్టూ పచ్చదనం...పక్షుల కిలకిలరావాలు.. చల్లగాలుల సావాసం... ఇవన్నీ గాంధారివనంలో కొద్దిరోజుల క్రితం కనిపించేవి. కానీ అవన్నీ నేడు కనుమరుగయ్యాయి. ప్రస్తుతం ఎండిపోయిన చెట్లు, విరిగిపోయిన బెంచీలు, పాడైన ఆటవస్తువులు, నిరుపయోగంగా ఉన్న బోటింగ్ పాండ్ దర్శనమిస్తున్నాయి. అటవీశాఖ ఆధ్వర్యంలో అందాల గాంధారి వనంగా రూపుదిద్దుకున్న పార్కు పాలకులు, అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేడు కళావిహీనంగా మారింది. ఎప్పుడూ సందర్శకులతో కళకళలాడిన గాంధారి వనం, పిల్లల పార్కు అధ్వానంగా మారడంతో సందర్శకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సంరక్షణ మరిచారు

జిల్లా కేంద్రానికి 8 కిలోమీటర్ల దూరంలో మందమర్రి మండలం బొక్కలగుట్ట హైవే పక్కనే వందలాది ఎకరాల్లో హరితశోభతో గాంధారి వనం నిర్మాణానికి అటవీశాఖ అధికారులు శ్రీకారం చుట్టారు. పర్యాటకులకు ఆహ్లాదం పంచాలన్న ఉద్దేశంతో అటవీ ప్రాంతంలో గలగల పారే వాగుల మధ్య శరవేగంగా గాంధారివనానికి రూపుదిద్దారు. 2017లో అప్పటి అటవీశాఖ మంత్రి జోగు రామన్న, పెద్దపెల్లి ఎంపీ బాల్క సుమన్ చేతులమీదుగా ప్రారంభించారు. హైదరాబాద్–మహారాష్ట్ర జాతీయ రహదారిలోని బొక్కలగుట్టలో ఉన్న గాంధారి మైసమ్మ ఆలయానికి చుట్టూ ఉన్న 341 ఎకరాల అటవీ శాఖ భూమిలో 270 ఎకరాల్లో పార్కు నిర్మాణం చేపట్టారు. ఇందులో టేకు, నల్లమద్ది, బండారి, వంగగణం, సోమి, తాప్సి, చైనా బాదం, కంక విషముష్టి, నారేప, ఎర్రచందనం, ఏగీస, నెమిలినార, కాగితం పూలు, గులాబీ, లూబియా, టేకోమా, రుతురాలు, గోరింట, తదితర వృక్షజాతితో పాటు నీడనిచ్చే, ఫలవృక్షాలను నర్సరీలో ఏర్పాటు చేశారు. అయితే మొక్కలు నాటడం వరకు బాగానే ఉన్నా వాటి సంరక్షణను మాత్రం అధికారులు మరిచారు. సోలార్ సిస్టమ్ ద్వారా మొక్కలకు నీటిని సరఫరా చేసేందుకు ఒకే ఒక్క మోటార్ ఏర్పాటు చేసినప్పటికీ కొద్దిరోజులుగా అదికూడా పనిచేయడం లేదు. దీంతో మొక్కలకు నీటి వసతే పూర్తిగా లేకుండా పోయింది. ఈ మధ్యే మరో 50 వేల మొక్కలు కూడా నాటారు. సంరక్షణ లేకపోవడంతో అవికూడా ఎండుతున్నాయి.

నిరుపయోగంగా బోటింగ్ పాండ్

జిల్లా కేంద్రానికి సమీపంలోనే గాంధారి మైసమ్మ ఆలయం, గాంధారి వనం, పిల్లల పార్కు ఉండటంతో అధిక సంఖ్యలో వచ్చే భక్తులు, పర్యాటకుల కోసం నాలుగెకరాల్లో కొలను తవ్వించారు. బోటింగ్ ప్రాంతానికి నలువైపులా కూర్చునేందుకు బల్లలు కూడా ఏర్పాటు చేశారు. బోటింగ్ మధ్య భాగంలో సేదతీరేందుకు పగోడ కూడా నిర్మించారు. అయితే ఇటీవల కొత్త బోటు కూడా తెప్పించినప్పటికీ పట్టించుకునేవారులేక పర్యాటకులకు మాత్రం అందుబాటులో లేకుండా పోయింది.

ఆహ్లాదం కరువు

మంచిర్యాల–నాగ్‌పూర్ హైవేకు కుడివైపున గాంధారి వనం ఉంటే ఎడమ వైపు 20 ఎకరాల్లో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు చేశారు. పిల్లలు ఆడుకునేందుకు వీలుగా ప్లే ఐటమ్స్ ఉంచారు. ఇందులో కర్రతో నిర్మించిన కుర్చీలు, పిల్లలు ఆడుకునేందుకు జారుడు పరికరాలు, రోజ్‌గార్డెన్ విశేషంగా ఆకట్టుకునేవి. ఇటీవల జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో పార్కు సగం వరకు పోయింది. ఆటవస్తువులు పూర్తిగా దెబ్బతిన్నాయి. నడకదారి కూడా అధ్వానంగా మారింది. జిల్లా కేంద్రానికి ఆనుకుని ఉన్న గాంధారి వనం, పిల్లల పార్కుకు తిరిగి పూర్వవైభవం తెచ్చేలా అటవీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కనీస సౌకర్యాల్లేవ్



గాంధారి వనానికి వాకింగ్ కోసమని నిత్యం వందల సంఖ్యలో జనం వస్తుంటారు. అయితే వారికి కనీస సౌకర్యాలు లేవు. ముఖ్యంగా మరుగుదొడ్లు కూడా లేవు. అలసిపోయిన వాకర్లు సేద తీరేందుకు బెంచీలు కూడా లేవు. తాగునీటి సౌకర్యం కూడా లేదు. వనం అభివృద్ధిపై అధికారులు, పాలకులు దృష్టి సారించాలి.

– ఎండీ.పాషా, వాకర్

సంరక్షణ మరిచారు



గాంధారి వనాన్ని అటవీ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవటం లేదు. వనంలో మొక్కలు నాటిన అధికారులు వాటి సంరక్షణ మరవడంతో అవి ఎండిపోతున్నాయి. ఇప్పటికైనా నందనవనంగా మార్చేలా అధికారులు ప్రణాళిక రూపొందించాలి.

– దండు వంశీకృష్ణ, స్థానికుడు

నిధుల కేటాయింపు లేదు

గాంధారి వనం అభివృద్ధికి ఎ లాంటి నిధులు కేటాయించ డం లేదు. ముఖ్యంగా కరో నా కాలం నుంచి నిధులు వి డుదల కాలేదు. అర్బన్ పా ర్కుల అభివృద్ధి కోసం నిధులు ఇవ్వాలని కోరుతున్నప్పటికీ ఎలాంటి ఫండింగ్ లేదు. పిల్లల పార్కు టికెట్‌ల ద్వారా వస్తున్న కొద్దిపాటి డబ్బులు మెయింటనెన్స్‌కే సరిపోతున్నాయి.

– ఎస్.రమేశ్, ఎఫ్‌ఆర్‌వో, మంచిర్యాల

క్లుప్తంగా

విద్యుత్‌ తీగలకు తగిలి మిర్చి దగ్ధం



ఐచర్‌ వాహనంలోంచి వస్తున్న పొగలు

బెల్లంపల్లి: మిర్చి బస్తాలు తరలిస్తున్న వాహనం ప్రమాదవశాత్తు విద్యుత్‌ తీగలకు తగలడంతో బస్తాలకు నిప్పంటుకున్న ఘటన శనివారం బెల్లంపల్లిలో చోటు చేసుకుంది. ఏపీలోని నందిగామ ప్రాంతం నుంచి మిర్చి బస్తాలతో బయలుదేరిన ఐచర్‌వ్యాన్‌ మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌కు వెళ్తుండగా డ్రైవర్‌ మార్గమధ్యలో బెల్లంపల్లి మున్సిపాలిటీలోని కన్నాల శివారులో జాతీయ రహదారి పక్కన వాహనాన్ని ఆపాడు. పైన ఉన్న విద్యుత్‌ తీగలకు మిర్చి బస్తాలు తగలడంతో మంటలు చెలరేగి సంచులకు అంటుకున్నాయి. గమనించిన డ్రైవర్‌ మరో వ్యక్తి సాయంతో చాకచక్యంగా బస్తాలను కిందకు తోసివేశారు. వాహనాన్ని కొంతదూరం తీసుకెళ్లి ఆపారు. అప్పటికే మిర్చి బస్తాల్లోంచి పొగలు వస్తుండటంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్‌ వచ్చి బస్తాలపై నీళ్లు చల్లడంతో మంటలు అదుపులోకి వచ్చాయి. ఘటనలో రూ.1.60 లక్షల నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. తృటిలో భారీ ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

మంచిర్యాలరూరల్‌(హాజీపూర్‌): ఈ నెల 17న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించిన హాజీపూర్‌ మండలంలోని దొనబండకు చెందిన యువకుడు శనివారం మృతి చెందాడు. గ్రామానికి చెందిన నాగవెల్లి శ్రీకాంత్‌ (25) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు మంచిర్యాలలోని ఓ ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. మృతుడు ప్రేమించిన యువతి కూడా ఆత్మహత్యకు యత్నించగా ప్రస్తుతం ప్రైవేట్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్సై ఉదయ్‌కిరణ్‌ను సంప్రదించగా ఆత్మహత్యకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య

చింతలమానెపల్లి(సిర్పూర్‌): ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై విజయ్‌ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని గూడెం గ్రామానికి చెందిన నింబర్ల బక్కుబాయి (50) దిందా గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్తున్నానని చెప్పి గురువారం ఇంటి నుంచి బయలుదేరింది. ఇంటికి తిరిగి రాకపోవడంతో ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా దిందా సమీపంలోని అటవీప్రాంతంలో ఉరేసుకుని కనిపించింది. మృతురాలి తమ్ముడు డొకె మల్లేశ్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

- ప్రాచీన ఒగ్గుకథకు జీవం
- పల్లెపదాలకు విశేష ఆదరణ

సాక్షి, మంచిర్యాలడెస్క్‌: జానపద కళారూపాల్లో ఒగ్గుకథకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఇది గానం, నృత్యం, నాటిక మిశ్రమంగా సాగుతుంది. కథలు.. పురాణాలు.. ఎన్నో చరిత్రలను కళ్లకు కట్టినట్లుగా.. వినసొంపుగా ఉంటూ శ్రోతలను కట్టిపడేస్తుంది. ఒగ్గుకథ కళాకారులు ఒక్కొక్కరు పదుల సంఖ్యలో కథలను అవలీలగా చెప్పేస్తారు. కళాపోషణను ప్రాణప్రదంగా భావిస్తూ.. వారసత్వంగా వచ్చిన కళను కాపాడుకుంటూ.. భావితరాలకు అందిస్తూ.. కథను బతికించాలనే ప్రయత్నం చేస్తూ.. ఒగ్గుకథకు విశేష ఖ్యాతిని ఆర్జిస్తూ ముందుకు సాగుతున్నారు.

కళాకారుల ఊరు



ఒగ్గు కథ చెబుతున్న గుంటి శ్రీశైలం బృందం

మంచిర్యాల జిల్లా నెన్నెల మండలం కోనంపేట కళాకారులు ప్రాచీనమైన ఒగ్గుకథకు జీవం పోస్తున్నారు. కోనంపేట ఒగ్గుకళకు పెట్టింది పేరు. ఏనుగుల శంకర్‌, గుంటి శ్రీశైలం, తిరుపతి, ఏనుగుల రమేష్‌ బృందాలు ఒగ్గుకథ ప్రదర్శనలో రాణిస్తున్నాయి. ఒగ్గు కళాకారులు చెప్పే కథలకు పల్లెజనం మంత్రముగ్ధులవుతారు. పెద్దమనిషి గుంటి బీరయ్య వందేళ్ల క్రితమే ఒగ్గుకు ఉగ్గు పోశాడు. ఆయన వారసత్వంగా గ్రామంలోని దాదాపు 80మంది గొల్లకుర్మ యువకులు కళాకారులుగా ఎదిగారు. ఏనుగుల శంకర్‌కు ఒగ్గుకథ సోగ్గాడనే పేరొచ్చింది. ఆయన కథకు పల్లె జనం మంత్రముగ్ధులు అవుతారు. ప్రదర్శన ఉందంటే చాలు గ్రామాల్లో సందడి నెలకొంటుంది. నిరక్షరాస్యుడైన శంకర్‌ వందల కథలను పుక్కిట పట్టి చిన్నతనం నుంచి జనాన్ని తన గాత్రంతో ఉర్రూతలూగిస్తున్నాడు. తన తాత గుంటి మల్లయ్య ద్వారా కథలను శంకర్‌ ఒంట పట్టించుకున్నాడు. మల్లన్న కథ, ఎల్లమ్మ, నల్లపోచమ్మ, గిరిజావతి, ఆయిళ్ల బీరప్ప, జయలక్ష్మీ, పెద్దిరాజు, పెద్దమ్మ కథ, శ్రీదేవి, ఐదు మల్లెపూల కథలు ప్రసిద్ధిగాంచాయి. తెలంగాణ, ఏపీ, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల్లో వందల ప్రదర్శనలు ఇచ్చారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతి, శిల్పకళారామంలో తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కళారాధనలో ఒగ్గు కళారూపాన్ని ప్రదర్శించారు. రవీంద్రభారతి సంచాలకులు మామిడి హరికృష్ణ కథకుడు శ్రీశైలంను అభినందించి ప్రశంసపత్రం అందజేశారు. పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయంలో ప్రదర్శనతో భక్తులను అలరింపజేయగా సత్యసాయిబాబా మెచ్చుకొని కోనంపేట కళాకారులను ఆశీర్వదించారు.



కథకారులు

ప్రభుత్వం ప్రోత్సహించాలి



ప్రాచీన కళ జానపద కళలకు ఒకప్పుడు మంచి గుర్తింపు ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. నానాటికీ ఆదరణ తగ్గడంతో కళాకారుల జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఈ కళలనే నమ్మి జీవనోపాధి పొందుతున్నాం. మాలాంటి కళాకారులకు ప్రభుత్వం ప్రోత్సహించాలి. అప్పుడే సంప్రదాయ కళలను కాపాడవచ్చు.

– ఏనుగుల శంకర్‌, ఒగ్గు బృందం నాయకుడు

సంప్రదాయాన్ని కాపాడుకుందాం



పాశ్చాత్య ధోరణి అనుసరిస్తూ బంగారంలాంటి ప్రాచీన కళలను మనమే మరుగున పడేస్తున్నాం. ఒగ్గు కథ తాతల కాలం నుంచి మాకు వారసత్వంగా వస్తుంది. ఈ ప్రాచీన కళ అంతరించిపోకుండా ఉండేందుకు కృషి చేయాలి. దేశ, విదేశాల్లో ప్రదర్శనలు ఇచ్చిన వారి వద్ద శిక్షణలు తీసుకున్నాం. అందుకే కష్టపడి విద్య నేర్చుకున్నాం. మా ఒగ్గు కళను కాపాడుకుంటాం.

– గుంటి శ్రీశైలం, ఒగ్గు బృందం నాయకుడు

సినిమాల్లోనూ..



మంచిర్యాల జిల్లా భీమిని మండలం వీగాం గ్రామానికి చెందిన పోలె పోశాలు, కర్రె రమేష్‌ బృందాలు ఒగ్గుకథలతో ఆకట్టుకుంటున్నాయి. ఒక్కో బృందంలో ఆరుగురు చొప్పున కళాకారులు ఉన్నారు. మల్లన్న ఒగ్గుకథ, వీరన్న, పోచమ్మ, పెద్దిరాజు, పెద్దమ్మ, అరబంతి పూబంతి ఇలా 20కి పైగా కథలు చెబుతారు. ఇప్పటివరకు వెయ్యికి పైగా ప్రదర్శనలు ఇచ్చారు. రమేష్‌ నర్తన వికాస్‌ అవార్డు అందుకున్నారు. వీరి ప్రదర్శనలను తిలకించిన మంత్రి హరీష్‌రావు, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్‌ మామిడి కృష్ణ, మాజీ ఎంపీ వివేక్‌, బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ప్రశంసించారు. సినిమాల్లోనూ ఒగ్గుకథ ప్రదర్శనలు ఇచ్చారు.

– కర్రె రమేశ్‌, భీమిని

కళను నమ్ముకుని..

ఆదిలాబాద్‌ జిల్లా నేరడిగొండ మండలం చించోలి గ్రామానికి చెందిన కాత్లే లక్ష్మణ్‌ బృందం కథాగానాన్ని నమ్ముకుని జీవనం సాగిస్తోంది. బృందంలో ఐదుగురు కళాకారులు ఉన్నారు. ఇప్పటివరకు వందకు పైగా ప్రదర్శనలు ఇచ్చారు. తమ కళను చాటుకోవడానికి వంశపారంపర్యంగా చెబుతూ వస్తున్నారు. కుటుంబ సభ్యులకు కథలపై శిక్షణ ఇస్తున్నారు. సుమారు వంద వరకు కథలు చెప్పగలుగుతారు. 2016 ఆగస్టు 15న తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రశంసపత్రం అందజేసింది. 2016 గిరి ఉత్సవ్‌లో ఐటీడీఏ ఉట్నూర్‌లో ప్రశంసపత్రం అందుకున్నారు. 2018 ఆగస్టు 31న హైదరాబాద్‌లో జరిగిన జానపద జాతర, తెలంగాణ బహుముఖ సకల సమ్మేళనం, నెహ్రూ యువ కేంద్రం ఆదిలాబాద్‌లో ప్రశంసపత్రాలు అందుకున్నారు.

ఆదుకోవాలి..



గత 30సంవత్సరాలుగా ఈ వృత్తిలో కొనసాగుతున్నాను. ప్రభుత్వం మా వృత్తిని గుర్తించి కళాకారులను ఆదుకోవాలి. ఈ తరంలో నేర్చుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. అనవాయితీ, కళను కాపాడుకోవడానికి కుటుంబ సభ్యులకు నేర్పిస్తున్నాం.

– కాత్లే లక్ష్మణ్‌

ఇల్లు మంజూరు చేయాలి



మా కుటుంబ సభ్యులం బృందంలో కలిసి వెళ్తుంటాం. ఇప్పటివరకు ఉండడానికి ఇల్లు సైతం లేదు. గుడిసెలోనే జీవనం గడుపుతున్నాం. ప్రభుత్వం ఇల్లు మంజూరు చేసి ఆర్థికంగా ఆదుకోవాలి. – రాధాబాయి

కళాకారులను గుర్తించాలి



వివిధ ప్రాంతాల్లో మా బృందంతో కలిసి కథాగానం వినిపిస్తున్నాం. దీన్ని ప్రభుత్వం గుర్తించి కళాకారులను ప్రోత్సహిస్తే బాగుంటుంది. మా కుటుంబ సభ్యులకు మాత్రమే నేర్పిస్తున్నాం. దీనిపై ఎక్కువగా ఎవరు శ్రద్ధ చూపడం లేదు. – తిరుపతి

వందేళ్ల వారసత్వం..!



రేడియో కేంద్రంలో ఒగ్గుకథ చెబుతున్న కళాకారులు

కుమురంభీం జిల్లా కౌటాల మండలం శీర్ష గ్రామంలో 30మంది ఒగ్గు కథ, ఒగ్గుడోలు కళాకారులు ఉన్నారు. వారసత్వంగా ఒగ్గుకథను ఒక తరం నుంచి మరో తరానికి అందిస్తున్నారు. వందేళ్లకు పైగా కథ ప్రస్థానం కొనసాగుతోంది. పోలే రాజులు బృందంలో పది మంది ఉన్నారు. ఇప్పటివరకు వందకు పైగా ప్రదర్శనలిచ్చారు. మల్లన్న బండారి ఒగ్గుకథ, గొల్లకేతమ్మ, రత్నంగి, మెడలంబ, పెద్దిరాజు, గిరిజవతి, గంగదేవి, పార్వతి కల్యాణం, పోచమ్మ, బీరయ్య, ఎల్లమ్మ ఒగ్గుకథ ఇలా 20కి పైగా కథలు అలవోకగా చెప్పగలుగుతారు. ఆర్థికంగా ప్రయోజనం లేకున్నా తమ కళను చాటుకోవడానికి ప్రదర్శనలు ఇస్తూ వారసత్వం కొనసాగిస్తున్నారు.

అవార్డులు, ప్రశంసలు

ఇప్పటివరకు రాష్ట్ర మంత్రులు, కలెక్టర్‌, ఉన్నతాధికారులు, ఎమ్మెల్యేల నుంచి ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. 2019లో ఢిల్లీలో డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌కలాం ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. ఇతర కార్యక్రమాల్లోనూ పలు అవార్డులు అందుకున్నారు.

తాతల కాలం నుంచి.



మా తాతల కాలం నుంచి వందేళ్లకు పైగా ఒగ్గు కథ చెబుతున్నాం. ప్రభుత్వ, ఇతర కార్యక్రమాల్లో ఇప్పటివరకు చాలా కథలు చెప్పాం. ఈ వృత్తితో ఆర్థికంగా ప్రయోజనం లేకపోయినా కళను చాటడానికి చెబుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులు మా కథలు విని ప్రశంసించినప్పుడు సంతోషం వేస్తుంది.

– పోలె రాజులు, కళాకారుడు, గ్రామం: శీర్ష

కళను నమ్ముకున్నాం..



మా పూర్వీకులు మాకు నేర్పిన కళను నమ్ముకుని జీవిస్తున్నాం. ప్రస్తుతం యువత ఒగ్గుకథలు నేర్చుకోవడానికి అంతగా ఆసక్తి చూపడంలేదు. ఇటీవల మా గ్రామంలో 15మంది యువకులకు ఒగ్గుడోలు శిక్షణ ఇచ్చాం. ప్రభుత్వం ఒగ్గు డోలు కళాకారులను ఆదుకోవాలి.

– సైళ్ల పోశయ్య, కళాకారుడు, గ్రామం: శీర్ష

పూర్వీకుల నుంచి..



శివశంకర ఒగ్గు కళాబృందం సభ్యులు

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామానికి చెందిన శివశంకర ఒగ్గు కళా బృందం తమ పూర్వీకుల నుంచి వస్తున్న ఒగ్గుకథ కళను నమ్ముకుని జీవనం సాగిస్తోంది. ప్రధాన కథకుడు ఎగుర్ల రాములు తన 18వ ఏట నుంచే తండ్రి మల్లయ్య ద్వారా ఒగ్గు కథ నేర్చుకుని కథలు చెబుతున్నాడు. ఈయన బృందంలో 18మంది కళాకారులు ఉన్నారు. ప్రదర్శనను బట్టి కళాకారులు పాల్గొంటారు. మల్లన్న కథ(మల్లికార్జున), పోచమ్మ, శంకరుడు, గంగాదేవి, ఎల్లమ్మ, నర్సింహాస్వామి, సమ్మక్క, పెద్దిరాజు, గిరిజావతి, అరబంతి పూబంతి, అరుణావతి, కరుణావతి, శ్రీవల్లి, భీమన్నపట్నాలు ఇలా 18వరకు కథలు చెబుతారు. ఇప్పటివరకు ఆదిలాబాద్‌ ఆకాశాణి రేడియతోపాటు వంద సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఒగ్గుడోలు ప్రదర్శనలు ఇస్తారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఈ ఒగ్గుకథను నేర్చుకోవడానికి కుటుంబీకులు, సమీప బంధువులు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్‌, మంచిర్యాల తదితర ప్రాంతాల్లో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రశంసపత్రాలు, మెమొంటోలు అందుకున్నారు. శ్రావణమాసం, సట్టివారాలు, శివరాత్రి పట్నాలు, ఆలయాలు, చనిపోయిన ప్రాంతాల్లో, గంగ ప్రాంతాల్లో కళలను ప్రదర్శిస్తూ ఉపాధి పొందడంతోపాటు కళను చాటుతున్నారు.

భావితరాలకు అందిస్తా..

నేను చిన్ననాటి ఉంచే నా తండ్రి మల్లయ్య ద్వారా ఒగ్గు కథ నేర్చుకున్నాను. భావితరాలకు ఒగ్గు కథను నేర్పించడం నా లక్ష్యం. ఒగ్గు కథకు ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. మా కుటుంబీకులకు కళను నేర్పిస్తున్నాను.

– ఎగుర్ల రాములు, ఒగ్గు కథకుడు

ఒగ్గుకథపై మక్కువతో..



ఒగ్గుకథను చిన్నతనంలో చూసినప్పుడు ఎంతగానో నచ్చింది. మా బంధువు, గురువు రాములు వద్ద దాదాపు ఎనిమిదేళ్ల నుంచి ఒగ్గుకథ నేర్చుకుంటున్నా స్త్రీవేషంలో ప్రదర్శనలు ఇస్తున్న. మొదట్లో స్త్రీ వేషం వేయడం ఇబ్బందిగా అనిపించినా ఒగ్గుకథపై మక్కువతో ఉన్నతంతా రాణిస్తున్నాను.

– గుంటి దామోదర్‌(స్త్రీ వేషం), గ్రామం: బయ్యారం, మం:వేమనపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి..



ఎన్నో ఏళ్లుగా మా పూర్వీకుల నుంచి వస్తున్న ఒగ్గుకథను నమ్ముకుని.. ఒగ్గుకథ చెప్పుకుంటూ జీవనం సాగిస్తున్నాం. డోలు విన్యాసాలు చేస్తున్నాం. ఒగ్గుకథ కళాకారులను ప్రభుత్వం ప్రత్యేక గుర్తింపు ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటున్నాం.

– ఎగుర్ల కుమార్‌, బట్వాన్‌పల్లి

రాష్ట్రస్థాయి పోటీల విజేత ఉమ్మడి ఆదిలాబాద్‌



విజయం సాధించిన ఆదిలాబాద్‌ జట్టు

ఆసిఫాబాద్‌: ట్రాన్స్‌కో అండ్‌ డిస్కమ్‌ విద్యుత్‌ ఉద్యోగుల ఇంటర్‌ సర్కిల్‌ రాష్ట్రస్థాయి క్రికెట్‌ పోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్‌ జట్టు విజయం సాధించింది. హైదరాబాద్‌ విజయానంద్‌ క్రికెట్‌ స్టేడియంలో నిర్వహించిన టి 20 క్రికెట్‌ టోర్నమెంట్‌ ఫైనల్‌ మ్యాచ్‌లో మహబూబ్‌నగర్‌ జట్టు టాస్‌ గెలిచి బ్యాటింగ్‌ ఎంచుకొని 136 పరుగులు చేసింది. ఆ తర్వాత బ్యాటింగ్‌ చేసిన ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా జట్టు 19.3 ఓవర్లలో 137 పరుగులు చేసి విజయం సాధించింది. ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 28 జట్లు పాల్గొన్నాయి. విజేతలను ఆ శాఖ ఎస్‌ఈ వాసుదేవ్‌, ఆదిలాబాద్‌ ఎస్‌ఈ సంపత్‌కుమార్‌, నిర్మల్‌ ఎస్‌ఈ చౌహాన్‌, మంచిర్యాల ఎస్‌ఈ శేషారావు, కాగజ్‌నగర్‌ డివిజనల్‌ ఇంజినీర్‌ రాజశేఖర్‌ అభినందించారు.

బైక్‌ పైనుంచి పడి యువకుడి మృతి

మామడ: బైక్‌ పైనుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన మండలంలోని శనివారం చోటుచేసుకుంది. ఎస్సై అశోక్‌ వివరాల ప్రకారం... వాస్తాపూర్‌ గ్రామానికి చెందిన పెంద్రం అచ్యుత్‌రావ్‌(23) శుక్రవారం రాత్రి పంటచేనుకు కాపలా ఉండేందుకు ద్విచక్రవాహనంపై వెళ్లాడు. బైక్‌ అదుపు తప్పి గుంతలో పడి మృతిచెందాడు. శనివారం ఉదయం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

నేరడిగొండ: మండలంలోని బుద్దికొండ గ్రామానికి చెందిన బందెల నర్సయ్య అనే వృద్ధుడు ఈ నెల14న ఇంటి నుంచి ఉదయం 11గంటలకు బయటకు వెళ్లాడు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. నాలుగు రోజులుగా కుటుంబీకులు బంధువులు, చుట్టు పక్కల గ్రామాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయన్న తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు సెల్‌: 87126 59947లో సంప్రదించాలని నర్సయ్య కుమారుడు బందెల లక్ష్మణ్‌ కోరారు.

డాక్యుమెంటరీ నిర్మాతకు సన్మానం



రాజును సన్మానిస్తున్న వరుణ్‌రెడ్డి

పాతమంచిర్యాల: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ జాతరపై డాక్యుమెంటరీ నిర్మించిన జిల్లాకు చెందిన ఉమా యాడ్స్‌ యజమాని జక్కుల రాజును ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి సన్మానించారు. శుక్రవారం రాత్రి ఉట్నూర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో పూలమాలలు, శాలువాతో సత్కరించారు. గిరిజనుల ఆచార సంప్రదాయాలు బాహ్య ప్రపంచానికి తెలిసే విధంగా డాక్యుమెంటరీ నిర్మించిన రాజును అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధారి మైసమ్మ ఆలయ కమిటీ చైర్మన్‌ రొడ్డ రమేశ్‌, వైస్‌చైర్మన్‌ గంజి రాజన్న పాల్గొన్నారు.

గోదావరిలో మునిగి యువకుడి మృతి

భైంసా: శివరాత్రి పర్వదినాన విషాదం చోటుచేసుకుంది. శనివారం బాసర గోదావరి నదిలో ఓ యువకుడు మృతిచెందాడు. మహారాష్ట్రలోని బిలోలి తాలూకా అజ్జే గ్రామానికి చెందిన ప్రదీప్‌(25) కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు రాగా, గోదావరి నదిలో స్నానానికి దిగాడు. దీంతో నీటి లోతు తెలియక ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



పక్షులను కెమెరాలో బంధిస్తున్న బర్డ్‌వాచర్లు

- రెండోదశ బర్డ్‌వాక్‌లో పక్షి ప్రేమికులు
- రాత్రి అడవిలోనే బస



పక్షి ప్రేమికుల కోసం ఏర్పాటు చేసిన గుడారాలు

జన్నారం(ఖానాపూర్‌): రెండోదశ బర్డ్‌వాక్‌కు సుదూర ప్రాంతాల నుంచి పక్షి ప్రేమికులు తరలివచ్చారు. ఏపీ, తెలంగాణకు చెందిన 70 మంది పక్షి ప్రేమికులు ఉదయం అటవీశాఖ అతిథి గృహంలో పేర్లు నమోదు చేసుకున్నారు. అనంతరం టీడీసీలో ఎఫ్‌డీవో మాధవరావు వారికి ఇక్కడి అడవులు, వన్యప్రాణుల గురించి వివరించారు. మధ్యాహ్న భోజనం అనంతరం సఫారి, జీపులలో ఇందన్‌పల్లి అటవీరేంజ్‌ పరిధిలోని మైసమ్మకుంట, ఘనిశెట్టి కుంట, కల్పకుంట ప్రాంతాలకు వెళ్లి బర్డ్‌వాక్‌లో పాల్గొన్నారు. ఉత్సాహంగా పక్షులను తమ కెమెరాల్లో బంధించారు. అధికారులు వారికి ఫైర్‌క్యాంప్‌ ఏర్పాటు చేశారు. రాత్రి అక్కడే ఉండి ఆదివారం ఉదయం బర్డ్‌వాక్‌లో పాల్గొంటారు. రేంజ్‌ అధికారులు హఫీజొద్దీన్‌, రత్నాకర్‌రావు, సిబ్బంది రమేశ్‌ వారికి ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వారు 'సాక్షి'తో తమ మనోభావాలు పంచుకున్నారు.

పక్షులంటే ఇష్టం



పక్షులంటే నాకు చాలా ఇష్టం. బర్డ్‌వాక్‌లో భాగంగా పక్షులను పరిశీలించేందుకు ఇక్కడికి వచ్చాం. చాలా రకాల పక్షులను గమనించాం. అడవిలో పర్యటించి పక్షులను చూడటం కొత్త అనుభూతిని ఇచ్చింది. ఇక్కడి అడవులు, కుంటలు చాలా బాగున్నాయి. – రవి, హైదరాబాద్‌

ఏర్పాట్లు బాగున్నాయి



రెండు రోజుల బర్డ్‌వాక్‌ కోసం ఇక్కడికి వచ్చాం. అడవులు చాలా బాగున్నాయి. కుంటల వద్ద పర్యాటకుల కోసం ఏర్పాట్లు బాగా చేశారు. రకరకాల పక్షులు కనిపించాయి. ఇక్కడికి రావడం కొత్త అనుభూతినిచ్చింది.

– సాహిత్య భైరవ్‌, హైదరాబాద్‌